మోజెస్ (కొందరు మోషే అని కూడా అంటారు) మావగారి అనుమతితో, భార్యాపిల్లల్ని వెంటపెట్టుకుని ఈజిప్టు బయలుదేరాడు. దారిలో దేవుడు, ఎందుకోగాని, అతన్ని చంపబోయాడు. అప్పుడు అతని భార్య తన కుమారుడికి ఒక పదునైన రాతితో సున్తీ చేసి ఆ చర్మాగాన్ని మోజెస్ పాదాలపై పడవేసింది. దానితో దేవుడు శాంతించి మోజెస్‌ను క్షమించాడు. అంతేకాదు, ఆరాన్ వద్దకు వెళ్లి "పోయి మోజెస్‌ను కలు" అన్నాడు. ఆరాన్ మోజెస్‌ను కలిశాడు. విషయాలు తెలుసుకున్నాడు. మోజెస్‌తో సహా ఈజిప్టు వెళ్లి అక్కడ హీబ్రూ నాయకులను కలిసి దేవుడు వాళ్లకు చెప్పినది చెప్పి వప్పించాడు. మోజెస్ దేవుడు చూపమన్న అద్భుతాలు చూపి, చెప్పమన్న మాటలు చెప్పాడు. వాళ్లు మోజెస్ వెంట ఇజ్రాయేలుకు వెళ్లడానికి ఒప్పుకున్నారు.

అప్పుడు వాళ్లిద్దరు ఈజిప్టు రాజు ఫారో వద్దకు వెళ్లారు. "నా పేర అడవిలో ఉత్సవం జరుపుకోవడానికి నా ప్రజలను వెళ్లనియ్యి' అని మా దేవుడు నీకు చెప్పమన్నాడు" అన్నారు. "మీ దేవుడెవరో నాకు తెలియదు. నేను ఎవర్నీ వెళ్లనివ్వను" అన్నాడు రాజు. "మేం ఆ ఉత్సవం చేసుకోకపోతే మా దేవుడు మమ్మల్ని శిక్షిస్తాడు" అన్నారు వీళ్లు. "పని మానేసి ఉత్సవాలేమిటి? ఆ బానిసలను వాళ్ల పని వాళ్లను చేసుకోనివ్వండి. ఇప్పటికే మీరు మా కంటె ఎక్కువ మంది పుట్టుకొచ్చారు. ఇప్పుడు పని కూడా ఎగ్గొడదామని చూస్తున్నారా?" అని వాళ్లని పంపేసి, బానిసలను పర్యవేక్షించేవారిని పిలిచి "మీరు యీ హీబ్రూలకు యిటుకలు చేయడానికి కావలసిన గడ్డి యివ్వకుండా, వాళ్లనే ఏరుకుని రమ్మనమనండి. రోజువారీ ఇటుకల లెక్క మాత్రం తగ్గడానికి వీల్లేదు. ఈ విధంగా పని పెంచండి. ఈ మోజెస్ మాటలు విని ఉత్సవాలనీ ఊరేగింపులనీ తిరిగేందుకు సమయం లేకుండా చేయండి." అని ఆజ్ఞాపించాడు.

వాళ్లు అలాగే చేయడంతో హీబ్రూలకు పని పెరిగింది. ఇటుకల సంఖ్య తగ్గడంతో శిక్షలు పెరిగాయి. దాంతో వాళ్లు మోజెస్ వద్దకు వెళ్లి "నీ మాట వినడం వలన రాజుగారికి మాపై కోపం పెరిగింది. మా బతుకు మరింత దుర్భరమైంది. ఇదీ మాకు నువ్వు చేసిన ఉపకారం!" అని నిష్టూరమాడారు. అప్పుడు మోజెస్ దేవుడితో ఫిర్యాదు చేశాడు, యిందుకేనా నన్ను యిక్కడికి పంపావ్ అని. దేవుడు చెప్పాడు – "నేను రాజుని శిక్షిస్తాను. చూస్తూండు. ముందు నువ్వు వెళ్లి నా హీబ్రూ ప్రజలను ఇజ్రాయేలు తీసుకెళ్లాలి. ఒప్పుకో అని రాజుకి చెప్పు" అని. "నా మాట ప్రజలే వినటం లేదు. ఇక రాజేం వింటాడు?" అన్నాడు మోజెస్. "నువ్వు దేవుడివని, ఆరాన్ నీ ప్రవక్త అని రాజుకి తోచేట్లు చేస్తాను. వెళ్లి రాజు ఎదుట నీ అద్భుతాలు చూపు" అన్నాడు దేవుడు.



మోజెస్, ఆరాన్ రాజు దగ్గరకు వెళ్లి అద్భుతాలు చూపబోయారు. కఱ్ఱ నేలమీద పడేస్తే పామైంది. అయితే రాజాస్థానంలోని ఇంద్రజాలికులు కూడా తమ కఱ్ఱలను పాములుగా మార్చి చూపారు. కానీ మోజెస్ పాము తక్కినవాటిని తినేసింది. మోజెస్ నైలు నది నీటిని రక్తంగా మార్చారు. చేపలు చచ్చిపోయి నీళ్లన్నీ కంపు కొట్టాయి. ప్రజలు నీళ్లు తాగలేకపోయారు. రాజు ఇంద్రజాలికులుకూడా యిలాగే చేసి చూపించారు. రాజు యీ మ్యాజిక్కులకు నేను లొంగనన్నాడు. వారం రోజులైనా సరే అతని దిగి రాలేదు. దాంతో దేవుడు ఊరంతా కప్పలు కురిపించాడు. అది భరించలేక రాజు సరే మిమ్మల్ని వెళ్లనిస్తాను కానీ యీ కప్పల పీడ వదిలించు అన్నాడు. మోజెస్ దేవుణ్ని ప్రార్థించగానే కప్పలన్నీ చచ్చిపోయాయి. కప్పల బాధ విరగడ కాగానే రాజు మళ్లీ మొండికెత్తాడు. ఆ తర్వాత దోమలు పుట్టుకుని వచ్చాయి. దాని తర్వాత ఈగలు. ప్రతీసారి రాజు పీడ వదిలేదాకా వీళ్లని పోనిస్తాననడం, తర్వాత మాట మార్చడం.

ఈ సారి దేవుడు ఈజిప్టువాళ్ల పశువులన్నిటినీ చంపేశాడు. ఈజిప్టు ప్రజల శరీరాలపై బొబ్బలు పుట్టేట్లు చేశాడు. వడగళ్లు కురిపించాడు. మిడతలదండును పంపించాడు. మూడు రోజులపాటు చీకటి కమ్మేట్టు చేశాడు. వీటన్నిటిలోనూ హీబ్రూ మతస్థులు మాత్రం రక్షింపబడ్డారు. వారికేమీ కాలేదు. ఇలా తొమ్మిది రకాల అరిష్టాలు చవి చూశాక ఈజిప్టు రాజు మోజెస్‌ను పిలిచి "మీ ప్రజలందరూ పిల్లాపాపాతో సహా ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లండి. కానీ మీ ఆలమందలు యిక్కడే విడిచి వెళ్లాలి" అని చెప్పాడు. దానికి మోజెస్ "అదేం కుదరదు, మా పశువులే కాదు, మా దేవుడికి బలి యివ్వడానికి మీ ఈజిప్టువాళ్ల పశువులు కూడా కావాలి. ఇవ్వండి" అన్నాడు. దాంతో రాజుకి కోపం వచ్చి మోజెస్‌ని తిట్టి పొమ్మన్నాడు. అప్పుడు మోజెస్ "మా దేవుడు అర్ధరాత్రి ఆకాశం నుండి వెళతాడు. ఈజిప్టులో నివసించే ఈజిప్టువారి సంతతిలో తొలిచూలు బిడ్డలందరూ చచ్చిపోతారు. వాడు రాజప్రాసాదంలో వున్నా సరే, గుడిసెలో వున్నా సరే, చావక తప్పదు. కానీ హీబ్రూలకు ఎవ్వరికీ ఏమీ కాదు. దీన్ని బట్టే తెలుసుకో – దేవుడు హీబ్రూలను కాపాడుతున్నాడని." అని చెప్పాడు. రాజు యిది నమ్మలేదు సరికదా హీబ్రూలను పంపడానికి సమ్మతించలేదు.

ఇదంతా విని దేవుడు మోజెస్‌తో చెప్పాడు – "మీరు ఇజ్రాయేలు వెళ్లడానికి సిద్ధంగా వుండండి. ఇప్పుడు మీరు పాస్ ఓవర్ (పాస్క/

పేసా) పండగ చేసుకోవాలి. ఈ నెలను సంవత్సరానికి ప్రథమమాసంగా గుర్తించండి. 10 వ రోజున ఒక గొఱ్ఱెను ఎంచుకుని 14 వ రోజున బలి యివ్వండి. బలి యిచ్చిన జంతువు రక్తాన్ని మీ యింటి గుమ్మాలకు పూయండి. ఆ రాత్రి నేను ఈజిప్టులో తిరుగుతాను. ఈ రక్తం పూయని గుమ్మాలున్న యిళ్లను ఈజిప్టువారి యిళ్లగా గుర్తిస్తాను. వాళ్ల తొలిచూలు పిల్లలను చంపేస్తాను. ఈజిప్టు దేవతలందరికీ శిక్షలు విధిస్తాను. ఈ దినాన్ని మీరు తరతరాలవరకు పర్వదినంగా గడుపుకోండి. మీ తొలి బిడ్డలు నాకు చెందుతారు. మీరు వెల యిచ్చి వారిని విడిపించుకోవాలి. భవిష్యత్తులో మీ పిల్లలు యిది ఎందుకు జరుపుకుంటున్నాం అని మిమ్మల్ని అడిగితే మీరు యీ ఈజిప్టు నిర్గమన గాథ వారికి చెప్పాలి. మన దేవుడు ఈజిప్టువారిని శిక్షించి మనల్ని రక్షించాడు అని చెప్పాలి.” అని.

హీబ్రూలు మోజెస్ చెప్పినట్టే చేశారు. వారి దేవుడు ఈజిప్టు వారి తొలిచూలు బిడ్డలందరినీ చంపేశాడు. మనుష్యులకే కాదు, పశువుల తొలిచూలు దూడలను కూడా చంపేశాడు. దేశంలో చావుచూడని యిల్లే లేదు. ఈజిప్టు రాజు విసిగిపోయాడు. మోజెస్‌ని పిలిచి “మీ వాళ్లందరినీ తీసుకుని యీ దేశం విడిచి వెళ్లిపో. మీరు వెళ్లకపోతే మేం కూడా చచ్చేట్లు వున్నాం.” అన్నాడు. మోజెస్ హీబ్రూలందరినీ వెళ్లడానికి సిద్ధం కమ్మని చెప్పాడు. వెళ్లి ఈజిప్టువారి వెండి, బంగారాలు తీసుకోమన్నాడు. ఈజిప్టువాళ్లు యిచ్చేశారు కూడా. వారి సంపదంతా తీసుకుని హీబ్రూలు ఇజ్రాయేలు వైపు కదిలారు. మగవాళ్లే ఆరు లక్షలమంది వున్నారు. మొత్తం మీద హీబ్రూలు ఈజిప్టులో 430 ఏళ్లు నివసించారు. మోజెస్ ధర్మమాని వారికి దాస్యవిముక్తి కలిగింది. వారందరూ ఒక్కసారి వెళ్లిపోవడంతో ఈజిప్టు రాజుకి బాధ కలిగింది. వీళ్లని యిలాగ పోనీయకూడదనుకుంటూ వారిని వెంటాడాడు. దాని కథ వచ్చే గురువారం. (సశేషం)

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఆగస్టు 2011)**